కార్పొరేషన్‌లో కలపొద్దు

- చిట్టి రామవరం, సుజాతనగర్ మండల వాసుల డిమాండ్
- సీపీఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకులు

కొత్తగూడెం గణేశ్ టెంపుల్/ కొత్తగూడెం టౌన్, జనవరి 20: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామాలను కలపొద్దంటూ చిట్టి రామవరం, సుజాతనగర్ మండల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. తొలుత కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసిన రామవరం ఏజెన్సీ ప్రాంతాన్ని తొలగించాలని ఆ ప్రాంత గిరిజన జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో కార్పొరేషన్ ఏర్పాటు సరికాదని అన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన రామవరాన్ని గతంలోనే కొత్తగూడెం మున్సిపాలిటీలో కలపడంతో కేంద్రం ప్రభుత్వ పథకాలను, సంక్షేమ ఫలాలను, గిరిజన హక్కులను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు చిట్టి రామవరం తండాను కూడా కార్పొరేషన్‌లో కలపాలనడాన్ని తాము గట్టిగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. అలాగే, సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో కలపొద్దని సీపీఎం అనుబంధ రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. పల్లె ప్రాంతాలను కార్పొరేషన్‌లో కలపడం వల్ల పేదలకు వ్యవసాయ కూలీలకు నష్టం కలుగుతుందని అన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలి

భద్రాచలం గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో రాహుల్

గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 20: సంక్రాంతి పండుగ సెలవులు పూర్తిచేసుకుని పాఠశాలలకు చేరుకున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై హెచ్‌ఎం, వార్డెన్లు దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్‌లో గిరిజన గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసీల నుంచి సోమవారం అర్జీలు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తన పరిధిలో ఉన్న వాటిని పరిష్కరించారు. మిగిలిన వాటిని అధికారులకు రిఫర్ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, ఈ గిరిజన దర్బారులో గిరిజనులు సమర్పించిన అర్జీల్లో పోడు భూములు, పోడు భూములకు పట్టాలు, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, జీవనోపాధి రుణాలు, వ్యవసాయ భూములకు కరెంటు మోటర్లు, గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం నిమిత్తం ఆర్థికసాయం తదితరాలు ఉన్నాయి. వీటిని ఐటీడీఏ అధికారులు ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి ఆన్‌లైన్ చేశారు. ఏపీవో డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, గురుకులం ఆర్‌సీవో నాగార్జునరావు, ఏవో సున్నం రాంబాబు, డీటీఆర్‌వోఎఫ్‌ఆర్ లక్ష్మీనారాయణ, ఏపీవో పవర్ వేణు, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ చంద్రశేఖర్, ఉద్యాన అధికారి ఉదయ్‌కుమార్, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, మేనేజర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, ఏపీడీవో అశోక్‌కుమార్, ఎల్‌టీఆర్‌డీటీ మణిధర్, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణరావు, వివిధ విభాగాల అధికారులు సిబ్బంది జోగారావు, మమత, నవ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రేగా పరామర్శ

అశ్వాపురం, జనవరి 20: మండలంలో పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రామచంద్రాపురం గ్రామానికి చెందిన మద్ది శంకరయ్య సంస్మరణ కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదే గ్రామంలో ఇటీవల తాటిచెట్టుపై నుంచి కిందపడి రెండు కాళ్లు విరిగిన కొండా వీరయ్యను, గుండెపోటుతో మృతిచెందిన మల్లెలమడుగు పంచాయతీ ఎస్టీకాలనీ వాసి కుంజా శ్రీను కుటుంబాన్ని, అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు జినక ప్రభాకర్‌ను రేగా పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, నాయకులు కొల్లు మల్లారెడ్డి, కంచుగట్ల వీరభద్రం, కందుల కృష్ణార్జునరావు, వీరారెడ్డి, గుంపెన శ్రీను, మేడవరపు సుధీర్, పాపారావు, గద్దల రామకృష్ణ, టేకుల సురేశ్‌రెడ్డి, మిట్టకంటి సురేందర్, వల్లపు కృష్ణ, మామిడి శ్రీను, డేరంగుల శేఖర్, శివారపు డాక్టర్‌బాబు, మందా హుస్సేన్, పున్నారావు, శేఖర్, నరేశ్ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన రేగా

మణుగూరు టౌన్, జనవరి 20: మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మనగర్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు పర్సా లక్ష్మీనారాయణ దశదిన కర్మ కార్యక్రమం సోమవారం జరిగింది. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంట లక్ష్మణ్, యూసఫ్ షరీఫ్, ఆవుల నర్సింహారావు, జావీద్ పాషా, మేకల రవి, ఉప్పుతల రామారావు, కేత అప్పాజీ, బొమ్మనబోయిన పవన్, మెరుగు ఈశ్వరయ్య, కొమరం పాపారావు, కొమరం రాజు, తాటి వెంకటేశ్వర్లు ఉన్నారు.

రూ.20కే బీమా

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 20: రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు బీమా బాసటగా నిలుస్తుందని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై కొండపర్తి నరేష్ కుమార్ అధ్యక్షతన రైల్వే స్టేషన్ ఆవరణలో సోమవారం ఆటో, ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, యజమానులకు అవగాహన సదస్సు జరిగింది. డీఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ.. వాహన చోదకులంతా అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. బీమా పాలసీ ద్వారా తమ తదనంతరం కూడా కుటుంబాలకు భరోసాగా నిలవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన(పీఎంఎస్‌బీవై), ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై)పై అవగాహన కల్పించారు. ప్రతి సంవత్సరం కేవలం రూ.20కే పీఎంఎస్‌బీవై ద్వారా రూ.2లక్షల వరకు ప్రమాద బీమా, రూ.436కే పీఎంజేజేబీవై ద్వారా బీమా పొందవచ్చని, సహజ మరణానికి కూడా రూ.2లక్షల వరకు ప్రయోజనం పొందవచ్చని వివరించారు. త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్, చుంచుపల్లి ఎస్సై రవి కుమార్, ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం సాధారణ సర్వసభ్య సమావేశం

కొత్తగూడెం అర్బన్, జనవరి 20: మున్సిపల్ పాలకవర్గ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును పాలకవర్గ సభ్యులు సన్మానించారు.

గురుకులం ఏర్పాటు స్థల పరిశీలన

ఇల్లెందు రూరల్, జనవరి 20: సమీకృత గురుకులం ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం ఉందని సేవాలాల్ సేన మండల యువజన అధ్యక్షులు భూక్యా సురేశ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రొంపేడులోని సర్వే నెంబర్ 309లో 25 నుంచి 30 ఎకరముల ప్రభుత్వ భూమి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంగోత్ ఆంజనేయులు, రాందాస్‌నాయక్, భూక్యా వీరు పాల్గొన్నారు.

కన్న కూతుర్నే కడతేర్చబోయిన తండ్రి

- భార్య మీద కోపంతో కుమార్తె గొంతు నులుమి హత్యాయత్నం
- ఈ నెల 13న ఘటన.. భార్యపై దాడితో తాజాగా వెలుగులోకి..

టేకులపల్లి, జనవరి 20: తల్లి మీద కోపంతో తాగిన మైకంలో కన్న కూతుర్నే ఓ తండ్రి కడతేర్చాలని చూసిన అమానవీయ ఘటన భద్రాద్రి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం గంగారం పంచాయతీ సంపత్‌నగర్ గ్రామానికి చెందిన కొర్స రవి, లక్ష్మి భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కుమార్తెలున్నారు. చిన్న కూతురు సాహిత్య (8). ఈ దంపతులిద్దరూ వ్యవసాయం చేసుకుంటూ జీవించేవారు. వారి మధ్య తరచుగా గొడవలు జరుగుతుండడంతో విడిపోయారు. ఊరి పెద్ద మనుషులు ఇద్దరినీ మందలించి కలిపారు. మళ్లీ కొన్నిరోజుల క్రితం గొడవపడ్డారు. దీంతో రవి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 13న ఇంటికి తిరిగి వచ్చాడు. ఆరు బయట ఆడుకుంటున్న చిన్న కుమార్తె సాహిత్యను పలుకరించారు. చాక్లెట్ ఇస్తానని చెప్పి పక్కనే ఉన్న జామాయిల్ తోటలోకి తీసుకెళ్లాడు. తన దగ్గర ఉన్న కండువాతో ఆ బాలిక గొంతు నులిమాడు. ఆమె స్పృహ కోల్పోయింది. కూతురు చనిపోయిందనుకున్న రవి.. అక్కడి నుంచి పారిపోయాడు. కొద్దిసేపటి తర్వాత స్పృహలోకి వచ్చిన సాహిత్య.. మెల్లగా నడుచుకుంటూ తల్లి దగ్గరకు వెళ్లింది. జరిగిన విషయాన్ని చెప్పింది. వెంటనే కుమార్తెను ఆమె తల్లి ఆసుపత్రికి తీసుకెళ్లింది. కాగా, కుటుంబ సభ్యులు మందలిస్తారని భావించిన రవి.. అప్పుడే ఆత్మహత్యాయత్నం నాటకమాడాడు. ఈ క్రమంలో మళ్లీ సోమవారం ఉదయం కూడా ఇంటికి వచ్చిన రవి.. కర్ర తీసుకొని భార్యపై దాడికి యత్నించాడు. ఆమె తప్పించుకొని వెళ్లి పోలీసు స్టేషన్‌కు చేరుకుంది. 13న తన కుమార్తెపై చేసిన హత్యాయత్నం గురించి, తనపై దాడి గురించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాద కారకుడికి జైలు

కొత్తగూడెం టౌన్, జనవరి 20: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారకుడైన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసు వివరాలు.. బందగిరి నగర్ చెందిన పూనెం పాపారావు, ఆయన కుమారుడు సురేష్ కలిసి లోడిగె బుచ్చిరాములు బైక్‌పై 2017, ఏప్రిల్ 1న వెంకటాపురం వెళ్తున్నారు. కరకగూడెం మండలంలోని మద్దెలగూడెం-రేగళ్ల మధ్యలో ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న లోడిగె బుచ్చిరాములుకు బలమైన దెబ్బలు తగిలాయి. 108 సిబ్బంది భద్రాచలం ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదం జరిగిన మరుసటి రోజున, సురేష్ తండ్రి పాపారావు ఇచ్చిన ఫిర్యాదుతో కరకగూడెం అప్పటి ఎస్సై రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు సాగించారు. ప్రమాదానికి నూపు రాం, సతీష్ కారకులుగా గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉండగానే నూపు రాం మృతిచెందాడు. కోర్టులో చార్జిషీట్ దాఖలైంది. 11 మంది సాక్షులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ విచారించారు. మొదటి నిందితుడు రాం చనిపోవడంతో అతడిపై కేసు కొట్టివేశారు. రెండో నిందితుడు సతీష్‌పై నేరం రుజువవడంతో రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మి ప్రాసిక్యూషన్ నిర్వహించారు. జిల్లా కోర్టు నోడల్ ఆఫీసర్ ప్రవీణ్, లైజన్ ఆఫీసర్ వీరబాబు, కోర్టు పీసీ మాలోత్ ఈశ్వర్ సహకరించారు.

నేడు, రేపు మెడికల్ బోర్డ్

కొత్తగూడెం సింగరేణి, జనవరి 20: అనారోగ్యం కారణంగా విధులు నిర్వహించలేకపోతున్న సింగరేణి కార్మికులకు మంగళ, బుధవారాల్లో సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో మెడికల్ బోర్డ్ నిర్వహిస్తారు. సంస్థవ్యాప్తంగా ఇలాంటి కార్మికులకు మెయిన్ ఆస్పత్రిలో వైద్యులు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.రిపోర్టుల ఆధారంగా ఇన్‌వాలిడేషన్‌పై బుధవారం బోర్డ్ నిర్ణయం తీసుకుంటుంది. విజిలెన్స్, ఎస్‌అండ్‌పీసీ పర్యవేక్షణలో మెడికల్ బోర్డును నిర్వహిస్తారు.

రుణ దరఖాస్తులకు ఆహ్వానం

పాల్వంచ రూరల్, జనవరి 20: నాలుగో విడత రుణమాఫీ అయిన రైతులు.. రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని డీసీఎంఎస్ చైర్మన్, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. నాలుగో విడత రుణమాఫీ కింద 99 మంది రైతులకు రూ.35 లక్షల రుణం మాఫీ అయిందన్నారు. రుణం కోసం వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సొసైటీ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిలిపివేయనున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని రైతులకు తెలపాలని కోరారు. సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, సభ్యులు రామమోహన్‌రావు, పాపారావు, జనార్దన్ రెడ్డి, సీతారాంబాబు, మదుసూధన్‌రావు, వెంకటేశ్వరావు, కిషన్, సీఈవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొత్తగూడెం అర్బన్, జనవరి 20: కొత్తగూడెం మున్సిపాలిటీలోని పది వార్డుల్లో రూ.4.42 కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న 31 అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26న మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగుస్తుందని చెప్పారు. పాలక వర్గానికి గుర్తింపు తెచ్చేందుకు, గడువులోగా ముమ్మరంగా శంకుస్థాపన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, తహసీల్దార్ పుల్లయ్య, కమిషనర్ శేషాంజన్ స్వామి, డీఈ రవికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆటో జీప్‌క్యాబ్ డ్రైవర్లకు 12వేలు ఇవ్వాలి

టేకులపల్లి, జనవరి 20: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆటో జీప్ క్యాబ్ డ్రైవర్లకు రూ.12వేలు ఇవ్వాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం టేకులపల్లిలోని టీయూసీఐ కార్యాలయంలో ఆవరణంలో జర్పుల సుందర్ అధ్యక్షతన జరిగిన ఆటో మోటార్ వర్కర్స్ జిల్లా ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. తొలుత జెండా ఆవిష్కరించారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, టీయూసీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి మాట్లాడుతూ దేశంలో పనిచేస్తున్నటు ఆటో మోటార్ జీప్, క్యాబ్ టాక్సీ మ్యాజిక్ తదితర రంగాల డ్రైవర్లు దుర్భరమైన జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు గోనెల రమేశ్, గోపాలరావు, సతీశ్, చంద్రశేఖర్, రమేశ్, పిల్లి రాజేశ్, మదార్, రంగారావు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయాల ప్రారంభం

అశ్వారావుపేట రూరల్,జనవరి 20: మండలంలోని మొద్దులమాడ, కోయరంగాపురం గ్రామపంచాయతీ కార్యాలయాలను సోమవారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ప్రసాద్, నాయకులు జూపల్లి రమేశ్‌బాబు, పంచాయతీ కార్యాదర్శులు, పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

అశ్వారావుపేట, జనవరి 20: రోడ్డు భద్రత, నియమాలపై అవగాహనతోనే ప్రమాదాలను నివారించవచ్చని ఎంవీఐ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాల నివారించేందుకు వాహనాలకు రేడియం స్టిక్కర్లు ఉంచాలని ఆదేశించారు. రేడియం స్టిక్కర్లు లేని వాహనాలకు స్టిక్కర్లు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం, జనవరి 20: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామికి ధరించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బేడా మండపంలో నిత్యకల్యాణం నిర్వహించారు.

రామదాసు మండపంలో రాపత్తు సేవలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాపత్తు సేవలు సోమవారంతో ముగిసాయి. పట్టణంలోని యూబీ రోడ్డులోని రామదాసు మండపంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి వారికి రాపత్తు సేవ నిర్వహించారు. తొలుత స్వామి వారిని అలంకరించి తహసీల్దారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు మండపానికి తీసుకొచ్చారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆదివాసీ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ, మహాధర్నా

భద్రాచలం, జనవరి 20: రాష్ట్రంలో జీవోనెం.3, దాని అనుబంధ జీవోలను కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీలకు వందశాతం రిజర్వేషన్లతో చట్టం తేవాలని ఆదివాసీ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం భద్రాచలంలో ఆదివాసీ సంక్షేమపరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఐటీడీఏ పీవో రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏకలవ్య మోడల్ సెంట్రల్ స్కూల్స్‌లో 90 శాతం ఆదివాసీ విద్యార్థులతో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు, రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, కోశాధికారి కొర్సా వెంకటేశ్వర్లు, జాయింట్ కార్యదర్శి ఈసాల సురేశ్, ఏటీఏ అధ్యక్షులు కల్లూరి జయబాబు, కార్యదర్శి సవలం వీరస్వామి, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

బూర్గంపహాడ్, జనవరి 20: మండలంలోని చెరువుసింగారం గ్రామ పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టించినా వాటిని ఇంతవరకు పేదలకు ఇవ్వలేదని, పేదలకు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చెరువుసింగారంలో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు డబుల్ బెడ్‌రూంలు అర్హులకు కేటాయించనట్లయితే సీపీఎం ఆధ్వర్యంలో పేదలకు అప్పగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పా సత్యనారాయణ, చిన్నరాజు, తాటి తిరుపతయ్య, ఉదయం శ్రీను, సర్పా పెద్దరాజు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

ఇల్లెందు రూరల్, జనవరి 20: అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్ నభి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రాజీవ్ నగర్ శివారులో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సున్నం రాజయ్యనగర్, దేవులపల్లియాకయ్య నగర్‌లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలన్నారు.కార్యక్రమంలో నాయకులు ఆలేటి కిరణ్, తాళ్ళూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, కొడెం బోస్, వజ్జ సురేశ్, జనార్ధన్‌రాజు, వెంకన్న, సంతోశ్, కమల, హసీనా, సుజాత, విజయ, కౌసల్య, రాజు, అమ్మి, పద్మ, రేష్మా పాల్గొన్నారు.

గ్రామంలో కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలి

ఇల్లెందు రూరల్, జనవరి 20: గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. సోమవారం మండలంలోని బొజ్జాయిగూడెంలో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించాలన్నారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం 65 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలను సీజ్ చేశారు. నెంబర్ ప్లేట్‌లేని వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఎస్సైలు సందీప్, నాగుల్‌మీరా, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేట, జనవరి 20: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన ఒకఇసుక వ్యాపారి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. గమనించిన స్థానికులు 100 డయల్ చేసి సమాచారం ఇచ్చారు. దీనితో అప్రమత్తమైన సిబ్బంది ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. ఇసుక ట్రాక్టర్‌కు అనుమతి లేకపోవటంతో తహసీల్దార్ పీ.కృష్ణ ప్రసాద్ రూ.5 వేలు జరిమానా విధించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆళ్లపల్లి, జనవరి 20: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన ఆళ్లపల్లి మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వజ్జ సిద్దు మిర్చి కలుపు మందు, గడ్డి మందు కలిపి తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆసుప్రతికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

దమ్మపేట రూరల్, జనవరి 20: దమ్మపేటలోని మల్లారం శివారులో ప్రభుత్వ భూమిలో గుడారాలు వేసుకుని ఉంటున్న పేదలను ఖాళీ చేయించారు. ఖాళీ చేసిన పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపయోగంగా వున్న ప్రభుత్వ భూమిలో గుడారాలు వేసుకుని నివాసం వుంటున్న వారిని రెవెన్యూ, పోలీస్ శాఖలు ఖాళీ చేయించడాన్ని ఖండించారు. ఈ పేదలకు స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోకినేపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


రమేశ్ (ఫైల్)

ఇల్లెందు, జనవరి 20: తరగతి గదిలో పిల్లలకు పాఠాలు బోధిస్తూ గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన ఇల్లెందు జేబీఎస్ స్కూల్లో చోటు చేసుకున్నది. సోమవారం ఇల్లెందు పట్టణం జేబీఎస్ (జూనియర్ బాలుర ప్రభుత్వ పాఠశాల)లో ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పిల్లి రమేశ్ (49) తరగతి గదిలో పిల్లలకు పాఠం బోధిస్తూ ఛాతిలో నొప్పి వస్తుందని ఒక్కసారిగా కుప్ప కూలిపోయారు. వెంటనే తోటి ఉపాధ్యాయులు స్పందించి 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డైరీ ఆవిష్కరణ

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 20: పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 3194 డైరీని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ సోమవారం ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోరండ్ల శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ దినేష్, డాక్టర్ సుందర్, డిప్యూటీ డెమో ఎండీ ఫైజ్ మొహియుద్దీన్, డీపీహెచ్‌ఎన్ డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

జూలూరుపాడు, జనవరి 20: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, వ్యాస రచన పోటీలను యల్లంకి చారిటబుల్ ట్రస్ట్ సోమవారం నిర్వహించింది. విజేతలకు బహుమతులను ట్రస్ట్ బాధ్యుడు యల్లంకి సత్యనారాయణ ప్రదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు లక్ష్మినర్సయ్య, రామిశెట్టి శ్రీనివాసరావు, శాంత కుమారి, రామనాథన్, ప్రసాద్, సునీత పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

జూలూరుపాడు, జనవరి 20: రోడ్డు భద్రత నియమాలపై స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పోలీసులు కలిసి జూలూరుపాడులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సై రవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రాజెక్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, జనవరి 20: 2024-25 సంవత్సరానికి సంబంధించి షెడ్యూల్ తెగల కులాల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల నుంచి కొత్త ప్రాజెక్టులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ సోమవారం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను www.ngo.tribal.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆసక్తి కలిగిన స్వచ్ఛంద సంస్థల కొత్త ప్రాజెక్టు ప్రతిపాదనలకు సంబంధించి ఫిబ్రవరి 15వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

వేతనాలు విడుదల చేయాలి

భద్రాచలం, జనవరి 20: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య, పేషెంట్ కేర్ సెక్యూరిటీ ఇతర విభాగాల్లో పని చేసే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పెండింగులో ఉన్న ఐదు నెలల వేతనాలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ పీవో బీ.రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ పట్టణ కన్వీనరు ఎంబీ నర్సారెడ్డి , నాగరాజు, ఆస్పత్రి యూనియన్ కార్మికులు రమ, వెంకటరమన, కుమారి, సరిత, మెహబూబ్, రమణ, కుమారి పాల్గొన్నారు.

పేదలందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

బూర్గంపహాడ్, జనవరి 20: భూమిలేని నిరుపేదలందరికీ ఆత్మీయ భరోసా అందేలా చూడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డీ.పున్నంచంద్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పథకం నిబంధనలు అర్హులకు శాపంగా మారుతున్నాయని, ఉపాధిహామీ పథకం ప్రమాణికంగా తీసుకోవడంతో ఆత్మీయ భరోసా అందరికీ అందే పరిస్థితి కనిపించడంలేదన్నారు. జాబ్‌కార్డు ఆధారంగా ఏడాదిలో 20 రోజుల పాటు పనికి వెళ్లినవారు, సెంటు భూమి లేని ఉపాధి కూలీలను మాత్రమే అర్హులుగా గుర్తిస్తున్నారని, జాబ్‌కార్డు ఆధారంగా కాకుండా భూమిలేని నిరుపేదలందరికీ ఆత్మీయ భరోసా పథకం అమలుచేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

చండ్రుగొండ, జనవరి 20: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని ఎస్సై శివరామకృష్ణ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతవారోత్సవాల సందర్భంగా సోమవారం ప్రధాన సెంటర్‌లో విద్యార్థులతో కలిసి ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ....రోడ్డుపై ప్రయాణించేటప్పుడు నియమ, నిబంధనలు ప్రతి వాహనదారుడు పాటించాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజర్ ఎల్లయ్య, డిప్యూటి తహసీల్దార్ ఎల్ ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

చండ్రుగొండ, జనవరి 20: తుక్కుగూడ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీరాములుపై జరిగిన దాడికి నిరసనగా పీఆర్‌టీయూ పిలుపు మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం విధులకు హాజరై, నిరసనను తెలిపారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి డీ.వాజిద్ మాట్లాడుతూ....ఉపాధ్యాయులకు భద్రత లేకపోవడం విచారకరమని, గౌరవప్రదమైనా ఉపాధ్యాయ వృత్తిలో ఉండే వారిపై దాడులు శోచనీయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షురాలు బేబిరాణి, ఉపాధ్యక్షురాలు విజయకుమారి, మండల కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దాడులను ఖండించాలి

ఇల్లెందు రూరల్, జనవరి 20: రంగారెడ్డి జిల్లా తుక్కగూడ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కంబాలపల్లి రాములుపై అరాచకశక్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏ రాంబాబు, ఏ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పల్లి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి, జనవరి 20: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాములుపై జరిగిన దాడిని ఉపాధ్యాయులు ఖండించారు. సోమవారం మండలంలోని కోయగూడెం ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్యా కిశోర్‌సింగ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు మాన్‌సింగ్, హరికుమార్, శేషగిరి, భానుప్రియ, రాంచందర్, నరేశ్, వరలక్ష్మీ, తారబాయి, రాజు పాల్గొన్నారు.

ప్రొఫెసర్లను అరెస్టు చేయడం అప్రజాస్వామికం

ఇల్లెందు, జనవరి 20: నాగర్ కర్నూల్ జిల్లా మైలారం గ్రామంలో గుట్టలు ధ్వంసం చేయడానికి వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షల ప్రారంభానికి వెళ్తున్న ప్రొఫెసర్లు హరగోపాల్, గడ్డం లక్ష్మణ్‌ను వెల్దండ పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. సోమవారం ఇల్లెందు న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌని నాగేశ్వరరావు, పొడుగు నర్సింహా రావు, కొక్కు సారంగపాణి, జె.సీతారామయ్య, చింతా నర్సింహారావు, అటికం శేఖర్, పూనెం కోటయ్య, రాంబాబు పాల్గొన్నారు.

కందకం తవ్వకం పనుల అడ్డగింత

చండ్రుగొండ, జనవరి 20: మండలంలోని రావికంపాడు గ్రామ శివారులోని అటవీ భూముల్లో సోమవారం ఫారెస్టు అధికారులు కందకాలు తవ్వుతుండగా పోడుదారులు అడ్డుకున్నారు. పోడుదారులకు ,అటవీశాఖ అధికారులకు వాగ్వాదం చోటు చేసుకున్నది. పోడుభూముల్లోంచి కందకాలు తవ్వవద్దని పోడుదారులు చెబుతుండగా, పోడుపట్టాలు ఉన్న భూముల జోలికి వెళ్లబోమని, పట్టాలు లేని అటవీభూముల కోసం రక్షణగా కందకం తవ్వుతున్నామని అటవీశాఖ కొత్తగూడెం డివిజనల్ అధికారి కొటేశ్వరరావు పేర్కొంటున్నారు. అడవుల సంరక్షణ అందిరి బాధ్యతని, అడవుల పెంపకం భావితరాలకు అవసరమన్నారు. ఘటన స్థలానికి ఎస్సై శివరామకృష్ణ తన సిబ్బందితో వచ్చి పోడుదారులను సముదాయించారు. చండ్రుగొండ, జూలూరుపాడు, కొత్తగూడెం రేంజర్లు శ్రీనివాసరావు, ప్రసాదరావు, శ్రీనివాసరావు, కందకం పనులు పర్యవేక్షించారు.

కళాశాల పురోగతికి కృషి చేయాలి

ఇల్లెందు రూరల్, జనవరి 20: కళాశాల పురోగతికి అధ్యాపకులందరూ సమిష్టి కృషితో పనిచేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు ఆయనను సత్కరించారు. తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జనరల్ బాడీ ఎన్నికల్లో జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సీనియర్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చిన్నప్పయ్యరే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభాకర్‌రావు, డాక్టర్ బి శ్రీదేవి, డాక్టర్ నాగేశ్వరరావు, పి. వెంకటేశ్వర్లు, డాక్టర్ రాకేశ్ శ్రీరామ, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, బి.సరిత, ఎస్ ఈశ్వర్, డాక్టర్ రాజు, డి.వెంకటేశ్వర్లు, టి. శ్రీకాంత్, యువకుమార్, లక్ష్మణ్‌రావు, సుజాత పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం నిలిపివేయాలి

మణుగూరు టౌన్, జనవరి 20: జనావాసాల మధ్యలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టవద్దని పీకేవన్ సెంటర్ గ్రామస్తులు కలెక్టరేట్‌లోని ఏవోకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సెల్‌టవర్ రేడియేషన్‌తో అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, వెంటనే టవర్ నిర్మాణాన్ని ఆపివేయాలని కోరారు. కార్యక్రమంలో బోగే చందర్‌రావు, కురం రవి, ఐతనబోయిన సతీశ్, కందుకూరి వీరమల్లు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

రామవరం, జనవరి 20: సింగరేణి కొత్తగూడెం ఏరియాలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన, మరణించిన ఎనిమిదిమంది కార్మికుల డిపెండెంట్లకు కారుణ్య నియామక పత్రాలను జీఎం శాలెంరాజు సోమవారం అందించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక నాయకులు మల్లికార్జున్ రావు, ఎండీ రజాక్, ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.